# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 10-04-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- పశ్చిమాసియాలో అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ దేశ గరిష్ట విద్యుత్, ఇంధన అవసరాలను విజయవంతంగా తీర్చినట్లు కేంద్రప్రభుత్వం తెలిపింది.
- దేశంలో ఎల్పిజి సరఫరాకు ఎటువంటి కొరత లేదని పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ స్పష్టం చేశారు.
- రాజ్యసభ సభ్యునిగా బీహార్ మాజీ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు.
- హోమియోపతి దేశ ఆరోగ్య నమూనాలో ఒక సుస్థిరమైన ఆరోగ్య వ్యవస్థగా స్థిరపడుతోందని ఆయుష్ శాఖా మంత్రి ప్రతాప్ రావు జాదవ్ అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియాలో అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ దేశ గరిష్ట విద్యుత్, ఇంధన అవసరాలను విజయవంతంగా తీరుస్తున్నామని కేంద్రప్రభుత్వం తెలిపింది. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన అంతర్-మంత్రిత్వ శాఖల మీడియా సమావేశంలో విద్యుత్ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి పీయూష్ సింగ్ మాట్లాడుతూ, తగినంత బొగ్గు నిల్వలతో అన్ని థర్మల్ విద్యుత్ ప్లాంట్లు పూర్తి సామర్థ్యంతో పని చేస్తున్నాయని చెప్పారు. రాబోయే మూడు నెలల్లో థర్మల్, సౌర, పవన, జల విద్యుత్ రంగాల ద్వారా 22 వేల మెగావాట్ల విద్యుత్ సామర్థ్యాన్ని పెంచడానికి ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందని వెల్లడించారు. ఇక పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ మాట్లాడుతూ, గృహ అవసరాలకు వినియోగించే ఎల్‌పిజి తో పాటూ ఇంధన సరఫరా దేశంలో స్థిరంగా కొనసాగుతోందని చెప్పారు. పెట్రోల్, డీజిల్ నిల్వలు తగినంత అందుబాటులో ఉన్నాయని, ఎక్కడా కొరత ఏర్పడలేదని స్పష్టం చేశారు. ప్రతిరోజూ ఐదు కిలోగ్రాముల బరువున్న ఎల్‌పిజి సిలిండర్లు లక్షకు పైగా అమ్ముడవుతున్నాయని తెలిపారు. దేశీయ సహజ వాయువు వినియోగానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలు ఎల్‌పిజి నుంచి పిఎన్‌జికి మారాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు సుజాత శర్మ చెప్పారు.

(వాయిస్…26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

ఇటీవల కొత్తగా రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన బీహార మాజీ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ చేత ఛైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ ఈరోజు ప్రమాణ స్వీకారం చేయించారు. అదే విధంగా నిన్నటితో పదవీకాలం ముగిసిన రాజ్యసభ మాజీ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ సింగ్ ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరిగి రాజ్యసభ సభ్యుడిగా నామినేట్ చేయడంతో ఆయనతో కూడా సి.పి. రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం చేయించారు. భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి రంజన్ గోగోయ్ పదవీ విరమణతో ఏర్పడిన ఖాళీకి హరివంశ్‌ను రాజ్యసభ సభ్యుడిగా నామినేట్ చేశారు. ఈ మేరకు హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈరోజు ఒక నోటిఫికేషన్ జారీ చేసింది.ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, జగత్ ప్రకాష్ నడ్డా, అర్జున్ రామ్ మేఘ్వాల్, రామ్ నాథ్ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు. రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన నితీశ్ కుమార్, హరివంశ్ లకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోషల్ మీడియా పోస్ట్ ద్వారా అభినందనలు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

భారతదేశానికి విశ్వసనీయ ఇంధన సరఫరాదారుగా కొనసాగుతామని ఖతార్ తన నిబద్ధతను పునరుద్ఘాటించిందని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి తెలిపారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఖతార్ లో పర్యటిస్తున్న ఆయన ఈరోజు దోహాలో ఖతార్ ఇంధన వ్యవహారాల సహాయ మంత్రి సాద్ షెరిదా అల్-కాబితో సమావేశమై చర్చలు జరిపారు. ఈ సమావేశంలో వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం సహా ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలలోని అన్ని అంశాలపై చర్చించినట్లు హర్దీప్ సింగ్ పూరి ఒక సామాజిక మాధ్యమ పోస్ట్‌లో తెలిపారు. పశ్చిమ ఆసియా ప్రాంతంలో త్వరగా శాంతి, స్థిరత్వం తిరిగి రావాలని ఇరుపక్షాలు ఆకాంక్షించాయని అన్నారు. అమెరికా, ఇరాన్‌ల మధ్య కుదిరిన రెండు వారాల కాల్పుల విరమణను భారత్, ఖతార్ స్వాగతించాయని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ ఇంధన సరఫరాలలో అంతరాయాలకు త్వరగా ముగింపు పలికి, సాధారణ పరిస్థితులను పునరుద్ధరించాల్సిన ఆవశ్యకతను భారత్, ఖతార్ దేశాలు ఉద్ఘాటించాయన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

హోమియోపతి ఒక విశ్వసనీయమైన వైద్య విధానంగా మరింత బలోపేతమవడానికి, సాక్ష్యాధారిత పురోగతి, నిరంతర పరిశోధనలు అత్యవసరమని ఆయుష్ శాఖా మంత్రి ప్రతాప్ రావు జాదవ్ అన్నారు. ప్రపంచ హోమియోపతి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయుష్ మంత్రిత్వ శాఖ “సుస్థిర ఆరోగ్యం కోసం హోమియోపతి” అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సుని న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఈరోజు ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ప్రతాప్ రావు జాదవ్ మాట్లాడుతూ....హోమియోపతి కేవలం ఒక ప్రత్యామ్నాయం మాత్రమే కాదని, పటిష్టమైన శాస్త్రీయ విధానంతో దేశ ఆరోగ్య నమూనాలో ఒక సుస్థిరమైన ఆరోగ్య వ్యవస్థగా స్థిరపడుతోందని చెప్పారు. గత కొన్ని సంవత్సరాలుగా, పటిష్టమైన సంస్థలు, పరిశోధనా సంస్థల మద్దతుతో భారతదేశం ఒక బలమైన హోమియోపతి వైద్య బృందాన్ని అభివృద్ధి చేసిందన్నారు. హోమియోపతి వ్యవస్థాపకుడు డాక్టర్ హానిమాన్ జయంతిని పురస్కరించుకుని ఏటా ఏప్రిల్ 10వ తేదీన ప్రపంచ హోమియోపతి దినోత్సవాన్ని నిర్వహిస్తారు.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

దేశ నిర్మాణ రంగం సాంకేతికత ఆధారిత పరిశ్రమగా అభివృద్ధి చెందుతోందని రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన 17వ నిర్మాణ పరిశ్రమ అభివృద్ధి మండలి విశ్వకర్మ అవార్డ్స్ 2026 కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ, దేశవ్యాప్తంగా నిర్మాణ నాణ్యతను మెరుగుపరచడం, దాని వ్యయాన్ని తగ్గించడం ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. నిర్మాణ రంగంలో ఆవిష్కరణలు, సాంకేతికత, సుస్థిర పద్ధతుల ప్రాముఖ్యతను ప్రముఖంగా ప్రస్తావించారు. అలాగే, మౌలిక సదుపాయాల అభివృద్ధి భవిష్యత్తు కోసం ప్రత్యామ్నాయ ఇంధనాలు, నూతన సాంకేతికతలను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని కూడా ఆయన ఉద్ఘాటించారు.. నిర్మాణ వ్యయాన్ని తగ్గించాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ , ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించడం, ప్రక్రియలను మెరుగుపరచడం ద్వారా సామర్థ్యాన్ని గణనీయంగా పెంచి, ప్రాజెక్ట్ వ్యయాలను తగ్గించవచ్చని నితిన్ గడ్కరీ పిలుపునిచ్చారు.

(వాయిస్... 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

ఉత్తర ప్రదేశ్‌లోని మధుర జిల్లాలో ఈరోజు జరిగిన పడవ ప్రమాదంలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మధ్యాహ్నం 2:45 నిమషాల సమయంలో లుధియానా నుంచి భక్తులతో వెళ్తున్న పడవ యమునా నదిలో బోల్తా పడటంతో ఈ ఘటన జరిగింది. ఇప్పటివరకు ఆరు మృతదేహాలను వెలికితీశారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. లుధియానా నుంచి సుమారు 30 మంది రెండు పడవల్లో నదిలో ప్రయాణిస్తున్నారని మధుర జిల్లా ఎస్పీ సి.పి.సింగ్ తెలిపారు. కేసీ ఘాట్ సమీపంలో ఒక పడవ మునిగిపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని ఆయన వివరించారు. పడవ ప్రమాదం కారణంగా జరిగిన ప్రాణనష్టం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సామాజిక మాధ్యమం వేదికగా ప్రధానమంత్రి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటన వల్ల ప్రభావితమైన వారికి స్థానిక యంత్రాంగం అన్ని విధాలా సహాయం అందిస్తోందని ప్రధానమంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ ఆసియా సంక్షోభం నేపథ్యంలో మారిషస్ ఇంధన భద్రతను బలోపేతం చేసేందుకు, ఆ దేశానికి చమురు, గ్యాస్ సరఫరా చేసే ఒప్పందాన్ని భారత్ ఖరారు చేస్తోందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ తెలిపారు. పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న సంక్షోభం, ఇంధన రంగంలో వ్యూహాత్మక భాగస్వామ్యాల ప్రాముఖ్యతను తెలియజేసిందని జైశంకర్ అన్నారు. 9వ హిందూ మహాసముద్ర సదస్సులో పాల్గొనేందుకు మారిషస్ లో పర్యటిస్తున్న జైశంకర్ పోర్ట్ లూయిస్‌లో ఈరోజు జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశపు మొట్టమొదటి ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్రాజెక్ట్‌ను ఒక భారత ప్రభుత్వ రంగ సంస్థ అభివృద్ధి చేస్తుండటం పట్ల తాను కూడా సంతోషంగా ఉన్నానని విదేశాంగ మంత్రి అన్నారు. స్వచ్ఛ ఇంధనం, పర్యావరణ అనుకూల పరిష్కారాల విషయంలో భారత్, మారిషస్ దేశాలు విస్తరిస్తున్న, చైతన్యవంతమైన భాగస్వామ్యాన్ని పంచుకుంటున్నాయని ఆయన అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

జన గణన 2027 మొదటి దశలో ఇప్పటివరకు ఐదు లక్షల 72 వేలకు పైగా కుటుంబాలు 'స్వీయ గణన ' (సెల్ఫ్ ఎన్యూమరేషన్) సదుపాయాన్ని వినియోగించుకున్నాయి. జనాభా గణన కోసం చేపట్టిన ఈ డిజిటల్ చొరవలో ప్రజల భాగస్వామ్యం పెరుగుతోందని భారత రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్  ఒక ప్రకటనలో తెలిపారు. జన గణన మొదటి దశ ఏప్రిల్ 1న ప్రారంభం కాగా, స్వీయ గణన సదుపాయం ఈ నెల 15వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం 11 రాష్ట్రాలు , కేంద్రపాలిత ప్రాంతాలలో ఈ స్వీయ గణన ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో గోవా, కర్ణాటక, మిజోరం, ఒడిశా, సిక్కిం, అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, జాతీయ రాజధానిలోని ఎన్.డి.ఎం.సి (NDMC) ప్రాంతం ,ఢిల్లీ కంటోన్మెంట్ బోర్డ్ ఉన్నాయి. ఏప్రిల్ 16 నుండి మే 15 వరకు ఇళ్ల జాబితా తయారీ, గృహ గణన ప్రారంభమవుతుంది. ఈ ప్రక్రియలో అన్ని భవనాల నిర్మాణాలను జాబితా చేయడంతో పాటు గృహ పరిస్థితులు, వసతులు,ఆస్తుల గురించిన సమాచారాన్ని సేకరిస్తారు. ఇక జన గణన రెండవ దశ వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరుగుతుంది. వయస్సు, లింగం, వృత్తి, అక్షరాస్యత,కుల వివరాలతో సహా వ్యక్తిగత సమాచారాన్ని సేకరించడంపై ఇది దృష్టి సారిస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =